ప్రజాశక్తి
ఆదివారం 19 నవంబరు 2023
5
శ్రీకాకుళం

మాట్లాడుతున్న నర్సింగరావు

అసమ్మతి సద్దుమణిగేనా?

- ఎచ్చెర్ల టిక్కెట్ కిరణ్‌కే అంటూ ప్రచారం
- కేడర్‌ను తన వైపు తిప్పకునేందుకు ప్రయత్నాలు
- ససేమిరా అంటున్న అసమ్మతి నాయకులు
- సామాజిక సాధికార బస్సు యాత్రకు సహాయ నిరాకరణ

ఎచ్చెర్ల వైసిపి టిక్కెట్‌పై నెలకొన్న సందిగ్ధత తొలగిపోయినట్లుగా కనిపిస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌కే అధిష్టానం టిక్కెట్ ఖరారు చేసినట్లుగా ఆయన వర్గీయులు ప్రచారం చేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు కిరణ్‌ను వ్యతిరేకిస్తూ విజయనగరం జడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను ఇక్కడ నుంచి పోటీ చేయాలని కోరారు. చిన్న శ్రీను కూడా ఒకానొక దశలో ఎచ్చెర్ల నుంచి పోటీ చేసేందుకు సుముఖంగానే కనిపించారు. ఆ తర్వాత పార్టీలో చోటు చేసుకున్న పరిణామాలతో పొరుగు జిల్లా నేత వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. దీంతో ఎప్పటి మాదిరిగానే ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అయితే అసమ్మతి నాయకులు మాత్రం ఆయన వెంట నడవటానికి ససేమిరా అంటున్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఎచ్చెర్ల నియోజకవర్గంలో రాబోవు ఎన్నికల్లో అభ్యర్థిని మారుస్తారంటూ ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. ఇక్కడ నుంచి చిన్న శ్రీను పోటీ చేస్తారంటూ కిరణ్ వ్యతిరేక వర్గీయులు మరోవైపు ప్రచారం మొదలు పెట్టారు. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై అధిష్టానం దృష్టి సారించింది. పార్టీలో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులను చక్కదిద్దేందుకు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను అధిష్టానం పంపడంతో ఆయన బుజ్జగింపులు జరిపారు. చీపురుపల్లిలోని తన క్యాంప్ కార్యాలయానికి మండలాల వారిగా ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం నాయకులను పిలిచి మాట్లాడారు. ఎమ్మెల్యే బావమరిది పిన్నింటి సాయికుమార్, మేనల్లుడు కంది నాని తప్ప మరెవ్వరూ మెత్త బడలేదు. ఇక్కడ నుంచి పోటీ చేసేందుకు చిన్న శ్రీను సైతం అయిష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. తాను స్థానికేతరుడు కావడం, పార్టీలో నెలకొన్న విభేదాలతో గెలుపు కష్టంగా మారే అవకాశాలు ఉండటంతో విజయనగరం జిల్లాలోనే మరో సురక్షిత నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. బొత్స కుటుంబంలో నెలకొన్న ఆధిపత్య పోరు కూడా ఆయనను వెనక్కి తగ్గేటట్లు చేశాయన్న ప్రచారమూ ఉంది. పొరుగు జిల్లాకు చెందిన ముఖ్యనేత తన ఓటమి కోసం పనిచేసే అవకాశాలు ఉండొచ్చన ప్రచారంతో చిన్న శ్రీను పోటీ ప్రయత్నాల నుంచి విరమించుకున్నట్లు తెలిసింది.

మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నాలు

తమ నాయకుడికే మళ్లీ ఎచ్చెర్ల టిక్కెట్ వస్తుందంటూ కిరణ్ అనుకూల వర్గం ప్రచారం చేసుకుంటోంది. ఎచ్చెర్ల టిక్కెట్ తనకే ఇస్తారన్న అధిష్టానం హామీతో ఎమ్మెల్యే కిరణ్ కుమార్ కేడర్ దూరమవ్వకుండా వారిని మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల తన సొంత డబ్బులతో నాయకులను తిరుపతి టూర్ తీసుకెళ్లారు. అయితే అసమ్మతి నాయకులు మాత్రం దూరంగా ఉన్నారు. ఎమ్మెల్యేకు వచ్చే ఎన్నికల్లో సహకరించేది లేదంటూ నాలుగు మండలాలకు చెందిన నాయకులూ భీష్మించుకుని కూర్చొన్నారు. మండలాల్లో ఎమ్మెల్యే పర్యటనలకు సైతం దూరంగా ఉంటున్నారు. జి.సిగడాం కు చెందిన కొంత మంది నాయకులు పార్టీ మారే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

యాత్రపై సమావేశాలు

వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల 27న ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో నిర్వహిస్తున్నారు. బస్సు యాత్రను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో భారీగా జన సమీకరణ చేపట్టి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అనుచరులు భావిస్తున్నారు. అయితే ఆయన వ్యతిరేక వర్గీయులు మాత్రం ఎమ్మెల్యేకు సహకరించే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఎమ్మెల్యే కిరణే స్వయంగా అన్ని గ్రామాలను సందర్శించి సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వాక్రా సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

మోడీని గద్దె దింపితేనే దేశానికి మేలు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మోడీని గద్దె దింపితేనే దేశానికి మేలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక క్రాంతి భవన్‌లో శనివారం నిర్వహించిన అఖిలపక్ష కార్మిక, రైతు సంఘాల సమన్వయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను లేబరు కోడ్‌లు రూపంలో తీసుకువస్తూ హక్కులను కాలరాస్తోందన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచుతామని ప్రకటిస్తున్నాయని అన్నారు. కార్మిక కోర్కెల పరిష్కారానికి ప్రతి సంవత్సరమూ కనీసం ఒకసారి జరగాల్సిన త్రైపాక్షిక భారత కార్మిక మహాసభను మోడీ ప్రభుత్వం 2015 నుంచి జరపటం లేదని చెప్పారు. గౌరవ వేతనం, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, నిర్ణీత కాలపరిమితి ఉద్యోగాల పేర్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులైన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ఓడరేవులు, రైల్వేలు, విద్యుత్, విమానాశ్రయాలు, ఎల్‌ఐసి, జాతీయ రహదారులను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని, ఎటువంటి పెట్టుబడి పెట్టకుండానే లీజుకు ధారదత్తం చేస్తోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ పన్నులను తగ్గించి జిఎస్‌టి భారాలను ప్రజలపై మోపిందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాల పిలుపు మేరకు విజయవాడలో 27, 28 తేదీల్లో జరిగే కార్మిక, రైతు మహాధర్నాకు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం నాయకులు మద్రాపు సూర్యనారయణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పెట్టి విద్యుత్ ఛార్జీలు భారీగా పెంచబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం మోడీ ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల అడుగులకు మడుగులొత్తుతోంది. మోడీ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్, సహకార రంగాలను ప్రయివేటీకరిస్తోందని చెప్పారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహనరావు అధ్యక్షత వహించిన సమావేశంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి, అనపాన షణ్ముఖరావు, జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు, కిసాన్ కాంగ్రెస్ సెల్ జిల్లా అధ్యక్షులు సనపల అన్నాజీరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, కిసాన్ మహాసభ నాయకులు మద్దెల హరనాథ్, వంకల అప్పయ్య, ఎం.రామారావు ఎఐకెఎంఎస్ నాయకులు సురేష్, కుమార్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.వి.రామకృష్ణ, కె.సూరయ్య, బి.వాసుదేవరావు, బి.చిన్నారావు, ఆర్.ప్రకాష్, నారాయణపురం భూపోరాట కమిటీ నాయకులు టి.నందోడు, సీతారాం, పి.కైలాస్ పాల్గొన్నారు.

బాలలు భావి భారతావనికి ప్రతిబింబాలు

శాసనసభ స్పీకర్ సీతారాం

మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

నేటి బాలలే భావి భారతావనికి ప్రతిబింబాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కొత్త రోడ్డు వద్ద ఉన్న శాంతి కన్వెన్షన్ హాల్‌లో బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల హక్కులను సంరక్షించడంలో ప్రభుత్వం ముందుందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి తదితర విషయాలపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని తెలిపారు. పాఠశాలల మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కోసం నాడు-నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టి రూపురేఖలను మార్చిన జగన్‌కే దక్కిందన్నారు. జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, పాల్గొనే హక్కు ముఖ్యమైనవని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు బాల్యవివాహాల నిర్మూలన, అక్రమ దత్తత నివారణ, బాలల అక్రమ రవాణా అరికట్టడంలో క్రియాశీల పాత్ర పోషించాలన్నారు. చైల్డ్‌లైన్ పాత్రను 1098 ప్రాముఖ్యతను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు నర్తు రామారావు, పాకలపాటి రఘువర్మ, అంబేద్కర్ యూనివర్సిటీ విసి నిమ్మల వెంకట్రావు, జిల్లా వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ రఘు పాత్రుని చిరంజీవి, అంతర్జాతీయ మానవ హక్కుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పప్పల రామ్మోహనరావు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ పాలకమండల సభ్యులు పేడాడ రమణి కుమారి, విజయనగరం జెన్‌టియు పాలక మండలి సభ్యులు దుప్పల వెంకటరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ మెట్ట మల్లేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి డైరెక్టర్‌గా
వెంకట గోపాల ధన బాలాజీ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

వెంకట గోపాల ధన బాలాజీ

విశాఖపట్నం గీతం యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ శనివారం రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ట్రిపుల్ ఐటి డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2019 నుంచి 2021 గీతం యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించారు. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఎచ్చెర్ల విద్యా ప్రగతికి కృషి, విద్య బలోపేతంపై ప్రత్యేక దృష్టి, అకడెమిక్ క్లాస్ వర్క్ నిర్వాహణకు ప్రత్యేక చర్యలు, విద్యార్థుల్లో ఉద్యోగ స్కిల్స్ ప్రాధాన్యత, రాష్ట్రస్థాయిలో ఉత్తమ విద్య సంస్థగా తీర్చేందుకు కృషి, ఒత్తిడి లేని విద్య అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ప్రొఫెసర్ జగదీశ్వరరావు నుంచి గోపాల వెంకట ధన బాలాజీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ కోర్లమోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ సల్లా ఆసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ రవి, డిప్యూటీ ఎఒ రఘుపతిరావు, పిఆర్ఒ మామిడి షణ్ముఖ, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయా న్ని సందర్శించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సహాయ కమిషనర్, కార్యనిర్వహణా ధికారి వి.హరిసూర్యప్రకాష్ స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

యువ ఓటరు నమోదుపై దృష్టి

జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

యువ ఓటర్లు నమోదుపై దృష్టి సారించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి రెవెన్యూ అధికారులు, సూపర్‌వైజర్లు, బిఎల్‌ఒలతో శనివారం సమీక్షించారు. ఫారం 6,7,8లపై చర్యలు ఎలా తీసుకోవాలి, యువ ఓటర్లను ఎక్కువ మందికి ఓటర్ల జాబితాలో చేర్చాలని, డెత్ ఓటర్లను తొలగించడంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇంతవరకు చేర్పులు, మార్పులు, తొలగింపులు ఎలా జరిగిందని అప్లికేషన్లను తనిఖీ చేశారు. ఓటర్లుగా కొత్త వారిని చేర్చడం, మృతి చెందిన వారిని తొలగించడం అనే అంశాలపై అలసత్వం వహించవద్దని బిఎల్‌ఒలకు సూచించారు. ఓటర్ల నమోదు సమయంలో వాంటీర్లను ఉపయోగించకూడదని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ గురుప్రసాద్, డిటి శ్రీహరి పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న డిఆర్ఒ గణపతిరావు

సాఫీగా కుల గణన సర్వే

- సిబ్బందికి తొలి దశ శిక్షణకు ఏర్పాట్లు పూర్తి
- జాయింట్ కలెక్టర్ నవీన్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఈ నెల 27 నుంచి జిల్లాలో మొదలు కానున్న కుల గణన సర్వే సాఫీగా జరిగేలా అధికార యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టరేట్ అధికారులకు శనివారం నిర్వహించిన శిక్షణ, అనంతరం ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లతో, తహశీల్దార్లతో, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో పొందుపరచిన పలు అంశాలపై వాటిని వినియోగించే పద్ధతులపై సుదీర్ఘ చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే సెక్షన్-ఎ, సెక్షన్-బి అనే రెండు దశల్లో జరుగుతుందన్నారు. ఎన్యూమరేటర్లుగా గ్రామ/వార్డు సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు వ్యవహరిస్తారని తెలిపారు. తరగతులకు సంబంధించిన సేకరించే సమాచార డేటాలో గోప్యత పాటించాలని సూచించారు. స్క్రీన్ షాట్లు తీయడం, స్క్రీన్ రికార్డింగ్‌లు చేయడం పూర్తిగా నిషేధం అనే సంగతి గుర్తించాలని స్పష్టం చేశారు. సామాజికంగా సంక్షేమ పథకాలను మెరుగ్గా రూపొందించడానికి, వాటిని అమలు చేయడానికి 92 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ కులగణన ఎంతగానో దోహదం చేస్తుందని చెప్పారు. మండల స్థాయిలో జరిగే శిక్షణకు సచివాలయానికి ఇద్దరు చొప్పున ఉద్యోగులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. తర్వాత దశలో వీరు వారి సచివాలయంలోని మిగిలిన సిబ్బందికి, వాలంటీర్లకు శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణా కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, జిల్లా పరిషత్ సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్.లక్ష్మీప్రసన్న, జిల్లా బిసి సంక్షేమ అధికారి అనురాధ, మాస్టర్ ట్రైనీ వి.మహేష్ పాల్గొన్నారు.

రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి

సిఐటియు నాయకుల డిమాండ్

మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలో గల అరబిందో ఫార్మా (ఎపిటోరియా) పరిశ్రమలో శనివారం సాయంత్రం ప్రొడక్షన్ బ్లాక్‌లో విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి చెందాడు.

నాలుగు గంటల సమయంలో ప్రొడక్షన్ బ్లాక్ 1లో విద్యుత్ ప్యానెల్ బోర్డు రిపేరు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో దశరథ్ ప్రొఫెషనల్స్ సర్వీసెస్ కాంట్రాక్టులో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న పూసపాటిరేగ మండలం రెల్లివలస గ్రామానికి చెందిన మహంతి బాలకృష్ణ (27) తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. యాజమాన్యం వెంటనే మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు సైతం చూపించకుండా పోలీసులను పెట్టి విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం మార్చురీలో పెట్టేశారు. విషయం తెలుసుకున్న సిఐటియు శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎన్‌వి రమణ, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు రెడ్డి శంకర్రావు, బి.సూర్యనారాయణ ఆస్పత్రి వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదంలో చనిపోయిన కార్మికుడి కుటుంబానికి 50. లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు నిరసన వ్యక్తం చేసారు. కార్మికుడి తల్లిని, కుటుంబ సభ్యులను నాయకులు ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరబిందో యాజమాన్యం సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వలనే తరుచూ ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోతున్నారని అన్నారు. గతంలో పలు ప్రమాదాలలో కార్మికులు చనిపోయిన విషయాన్ని గుర్తు చేసారు. అరబిందో యాజమాన్యానికి లాభాలు తప్ప కార్మికుల ప్రాణాలకు విలువ ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రభుత్వ యంత్రాంగం సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు.

సూపర్-60 కళాశాల సందర్శన

విద్యార్థులతో మాట్లాడుతున్న పిఒ కల్పనకుమారి

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యాన శ్రీకాకుళం వైటిసిలో నిర్వహిస్తున్న ఐఐటి సూపర్-60 కళాశాలను పిఒ కల్పనకుమారి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ బాగా చదవాలని, చదువే మన జీవితాలను మార్చగలదని అన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ వారికి అందుతున్న శిక్షణ గురించి ఆరా తీశారు. విద్యార్థులకు అవసరమయ్యే అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఉన్నత చదువులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఐఐటి శిక్షణ అత్యుత్తమంగా అందించాలని సిబ్బందికి సూచించారు. అలాగే శ్రీకాకుళంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సంబంధిత ఎటిడబ్ల్యుఒకు పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో సూపర్-60 కళాశాల ప్రిన్సిపాల్ మురళీబాబు, కిరణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంతా క్రికెట్ మయమే

- నేటి ఫైనల్ మ్యాచ్‌పై అందరిలోనూ ఉత్కంఠ
- క్రికెట్ వీక్షించేందుకు పలుచోట్ల భారీ స్క్రీన్లు ఏర్పాటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, రణస్థలం

సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న యువతీ యువకులు

అహ్మదాబాద్‌లో ఆదివారం జరగనున్న భారత-ఆస్ట్రేలియా ప్రపంచ కప్ ఫైనల్‌పై అంతటా చర్చ జరుగుతోంది. ఫైనల్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించాలని కోరుతున్నారు. అన్ని పనులు పక్కన పెట్టి క్రికెట్ మ్యాచ్ చూసేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో యువకులు అందరూ కలిసి ఒక చోట చూసేందుకు స్క్రీన్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరోవైపు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తరుపున శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎంహెచ్ స్కూల్ గ్రౌండ్‌లో భారీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారు. పలాసలో మత్స్య, పశుసంవర్థక, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కాశీబుగ్గలోని వైఎస్ఆర్ స్క్వేర్ వద్ద భారీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారు. క్రికెట్ మ్యాచ్ ఫైనల్లో టీమిండియా విజయం సాధించాలని కోరుతూ నిఖిల కలిశెట్టి విద్య, వైద్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన శనివారం రణస్థలం మండల కేంద్రంలో యువతతో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిఖిల కలిశెట్టి విద్య, వైద్య ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ఆదివారం జరగబోయే వరల్డ్ కప్ మ్యాచ్‌లో భారత జట్టు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడాకారులకు భారతీయుల ఆశీస్సులు నిండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో క్రీడా అభిమానులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

రాజకీయ ఆట.. వేట

వీక్షణం

మరో ఐదారు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల్లో ఆట, వేట మొదలైంది. ఆయా పార్టీల్లో స్థిరత్వం కనిపించడం లేదు. క్షణక్షణం మారిపోతున్నాయి. సరికొత్త ఆలోచనలు, సూచనలతో మార్పులు చేర్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితి ప్రధాన రాజకీయక పార్టీల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రధాన పార్టీల వ్యూహకర్తలు అందిస్తున్న సూచనలు అమలువుతున్నట్లు కనిపిస్తుంది. అధికార పక్షం శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి ఎంపికలో మల్లగుల్లాలు పడుతున్నట్లు పరిణామాలు చెబుతున్నాయి. నిన్నటి వరకు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పేరు తెరపైకి వచ్చింది. ఇప్పుడు మళ్లీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పేరు తెరపైకి వచ్చింది. ప్రభుత్వ ప్రధాన సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి నుంచి ఎంపీ అభ్యర్థిగా వెళ్లాలని సీతారాంకు సమాచారం వచ్చిందని ఆ పార్టీలో ప్రచారంలో ఉంది. అదే నిజమైతే అది సూచన అవుతుందా! అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆదేశామా! అన్నది ఇతమిద్ధంగా తెలియాల్సి ఉంది. రాష్ట్ర రాజకీయాలను పరిశీలిస్తూ.. నివేదికను ఎప్పటికప్పుడు అందిస్తున్న వ్యూహకర్త ప్రశాంత కిషోర్ మాత్రం సీతారాం పేరు ఉంటే అందుకనుగుణంగా జగన్ ఆదేశిస్తారన్నది పార్టీలో ప్రచారం ఉంది. ఈ ప్రచారం నిజమైతే ఆమదాలవలస నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థిని వెతుక్కోవాల్సి వస్తుంది. ఇప్పటికే ఆశావహుల్లో ప్రధానంగా ముందుకొస్తున్న అహింస నినాదం చేసిన వారి నామధేయంతో ఉన్న వారికి టిక్కెట్ లభించే అవకాశం ఉందని ప్రచారం ఉంది. అయితే ప్రశాంత కిషోర్ నివేదిక ఎమ్మెల్యే అభ్యర్థిగా సీతారాంకు ప్రత్యామ్నాయంగా ఎవరు పేరు సూచిస్తారన్నది చర్చనీయాశంగా ఉంది. ఎంపీ టిక్కెట్ కోసం శ్రీకాకుళం నుంచి ప్రముఖ డాక్టర్ ఎదురు చూస్తున్నారన్నది మొదటి నుంచీ ప్రచారంలో ఉంది. ఈ సూచన అమల్లోకి వచ్చే ఆశావహులు ప్రత్యామ్నాయదారులను వెతుక్కోవాల్సి వస్తోంది.

రాజకీయ ప్రచారంలో జిల్లాలో టిడిపి కంటే అధికార పార్టీ ముందున్నది. బూత్‌స్థాయిల్లో ఓటర్ల జాబితాలను పట్టుకుని వ్యూహాలు రూపొందిస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటి వరకు జిల్లాలో సామాజిక సాధికర బస్సు యాత్రను నాలుగు నియోజకవర్గాల్లో పూర్తి చేసినప్పటికీ జగన్ అవసరం, జగన్ వెంటనే మేము అన్న నినాదాలతో ప్రచార కార్యక్రమాలు, జెండా ఎగురు వేయడం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అధికార పార్టీకి ఎంపీ అభ్యర్థి ఎంపికలోనూ, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపికలోనూ ఫజల్‌గా తయారైనట్లు పార్టీ వర్గాల్లో భావిస్తున్నట్లు తెలిసింది. పలాస, పాతపట్నం, ఎచ్చెర్ల, టెక్కలి నియోజకవర్గాల్లో గ్రూపుల పోరు ఉండనే ఉంది. జిల్లాలో టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుతో కొంత వరకు నిస్తేజంగా ఉన్నారని వాతావరణం కనిపిస్తుంది. రిమాండ్‌లో ఉన్న సమయంలో కార్యక్రమాలు చేపట్టినా దాన్ని ప్రజల వరకు తీసుకెళ్లడంలో విఫలమయ్యారన్నది ఆ పార్టీ నేతలు చెప్పే పరిస్థితి ఉంది. అదే సమయంలో టిడిపి, జనసేన పొత్తు ఉంటుందని పవన్‌కళ్యాణ్ ప్రకటించడంతో నీరసపడ్డ శ్రేణుల్లో కొంత కదలికలు కనిపించింది. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ టిడిపి, జనసేన సమన్వయ కమిటీ సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాల్లో ఆశించిన ఫలితాలు కనిపించలేదని తెలిసింది. టిడిపితో కలసి పనిచేయడంతో తామ స్వతంత్ర కోల్పోతామని, తమకు పట్టించుకునే పరిస్థితి ఉండదని పలువురు పవన్ అభిమానులు చెబుతున్నారు. గత ఎన్నికల్లో జిల్లాలో జనసేన తరుపున పలువురు పోటీ చేశారు. ఓట్లు ఎన్ని వచ్చినా ఈ సారీ అలా పోటీ చేసే పరిస్థితి ఉండదు. ఏ నియోజకవర్గంలోనైనా జనసేన అభ్యర్థి నిలచే పరిస్థితి వస్తే అక్కడ బలమైన అభ్యర్థి ఎవరన్నది ముందుగా అంచనా వేస్తారట. జనసేనకు కేటాయించిన నియోజకర్గంలో టిడిపి అభ్యర్థి బలముందని భావిస్తే ఆయనకే జనసేన టిక్కెట్ ఇచ్చి పోటీలో పెడతారు. అలా అయితే జనసేనకు తక్కువ ఇచ్చినట్లు ఉంటుందని, టిడిపి అభ్యర్థి గెలుచినట్లు అవుతుందని సీనియర్ టిడిపి నేత ఒకరు చెబుతుండడం విశేషం. అందుకు తెలంగాణా ఎన్నికలను వారు ఉదహరిస్తున్నారు. హైదరాబాద్‌లో బిజెపికి చెందిన వారే జనసేన టిక్కెట్ ఇచ్చి బరిలోదించారన్న వార్తలు లొచ్చాయి. టిడిపి వ్యూహకర్త రాబిన్ అర్య సూచనల మేరకు పార్టీ కొత్త ఆటను ప్రారంభించినట్లు ప్రచారం జరుగుతుంది. టిడిపి బలహీనడింది ఈ మాట అన్నది ఎవరో కాదు పార్టీతో పొత్తుకు సిద్ధమైన పవన్‌కళ్యాణ్. అందులో భాగంగా టిక్కెట్ ఆశిస్తూ... వైసిపిలో క్రియాశీలక కార్యక్రమాల్లో పాల్గొంటున్న ప్రముఖ డాక్టర్‌ను టిడిపిలోకి ఆహ్వానిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పుడు టిక్కెట్ ఇవ్వలేమని, అధికారంలోకి వచ్చిన తరువాత సముచిత స్థానం కల్పిస్తామని వేట మొదటుపెట్టినట్లు తెలిసింది. కళ్లముందున్న ఆశలను తుంచేసుకుని ఎగురే పిట్టకు మసాల అన్నచందంగా గోడ దూకుతామా! లేదా! అన్నది చూడాల్సి ఉంటుంది. జిల్లాలో టిడిపి గ్రూపు రాజకీయాలను పెంచి పోషించడంలో దశాబ్దాల చరిత్ర ఉంది. అందులో భాగంగానే గత రెండేళ్లుగా సరికొత్త ఆశావహులను తెరపైకి తీసుకువచ్చి తోలుబొమ్మలాట ఆడించడం సూస్తున్నాం. అలాంటివి శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల్లో కనిపిస్తుంది. ఇలాంటి రాజకీయ ఆటలో వేట మొదలు పెడితే ఎవరు ఎవరికి చిక్కుతారో, ఎవరు ఎవరికి మిగులుతారో ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొలదీ బయటపడుతుంది.

- సత్తారు భాస్కరరావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

యాత్ర విజయవంతమే లక్ష్యం

ప్రజాశక్తి- లావేరు

సామాజిక సాధికారిక బస్సుయాత్ర విజయవంతమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం లావేరు, గురుగుబిల్లి, అదపాక, గుర్రంపాలెం, వెంకటాపురం, కొత్తకుంకం, పెద్దలింగాలవలస, గోవిందపురం, కొత్తకోట తదితర గ్రామాల్లోని సచివాలయాల ఆవరణలో ఈనెల 27న విలసపాలెంలో సామాజిక సాధికారిక బస్సుయాత్రను నిర్వహించనున్న నేపథ్యంలో అధికంగా ప్రజలు పాల్గొనే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి లుట్ల అమ్మాజమ్మ, ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మండల పార్టీ కన్వీనర్ రాజేనాయుడు, సీనియర్ నాయకులు గొర్లె అప్పలనాయుడు పాల్గొన్నారు.

రక్తపరీక్షలను నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

'ఐతమ్' విద్యార్థులకు రక్తపరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 1100 మంది మొదటి ఏడాది బిటెక్ విద్యార్థులకు ఇండియన్ రెడ్‌క్రాస్ శ్రీకాకుళం, ఐతమ్ ఎన్‌ఎస్‌ఎస్ విభాగాలు శనివారం సంయుక్తంగా 'ఒన్ మిలియన్, బ్లడ్ గ్రూప్' నినాదంతో నిర్వహించిన రక్తపరీక్షలు కలెక్టర్ ఆదేశాల మేరకు జరిపినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ప్రతీ ఏడాది విద్యార్థులకు యోగా, వ్యక్తిత్వ వికాసం, రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై నిపుణులతో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 18వరకు ఐటి, సిఎస్‌ఎం, సిఎ, సిఎస్‌ఇ గ్రూపులకు చెందిన 700 మందికి అవగాహన కల్పించామన్నారు. ఈ సదస్సుల్లో ఎస్‌ఐ రామకృష్ణ, ఎంవిఐ డి.సంజీవరావు, యోగాచార్యులు, గేదెల చంద్రశేఖర్, అగ్నిమాపక అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారని డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పెంకి చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ డాక్టర్ బి.బలరాం పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి- పలాస

బంగారు పతకం సాధించిన శిరీష

గోవాలో జరిగిన జాతీయ క్రీడల్లో పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం బిఎ చదువుతున్న ముగడ శిరీష 4-400 రిలే పరుగు పందెంలో బంగారు పతకం సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ కళాశాల స్థాపించి మూడేళ్లల్లో జాతీయ స్థాయిలో తమ కళాశాలకు చెందిన విద్యార్థిని శిరీష బంగారు పతకం సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. శిరీషను పిడి డాక్టర్ మధు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

చెక్కు అందజేస్తున్న తానా ప్రతినిధులు

విద్యార్థికి ఉపకార వేతనం

ప్రజాశక్తి- పొందూరు

మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థిని గురుగుబెల్లి ఢిల్లీశ్వరికి అమెరికాకు చెందిన తానా సంస్థ ప్రకటించిన రూ.50వేలు ఉపకార వేతనాన్ని శనివారం ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య చేతులు మీదుగా అందజేశారు. గతంలో ఢిల్లీశ్వరి ప్రదర్శించిన స్వామి వివేకానంద స్ఫూర్తిదాయక ప్రసంగాన్ని మెచ్చుకుని ఏడాదికి రూ.25వేలు చొప్పున ఉపకార వేతనాన్ని అందజేస్తామని ప్రకటించారు. దీంతో రెండు సంవత్సరాలకు సంబంధించి రూ.50 వేలును విద్యార్థినికి అందజేశారు. ఈ విద్యార్థిని తండ్రి కరోనా సమయంలో మరణించడంతో విషయం తెలుసుకున్న తానా ప్రతినిధులు రామ్‌చౌదరి ఉప్పుటూరి, సంజన ఉప్పులూరి, రూఖ ఉప్పలూరి విద్యార్థినిని దత్తత తీసుకుని చదివించడంతో పాటు ఈ ఉపకార వేతనాన్ని అందజేస్తున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్ఆర్ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం 8.30 గంటలకు వైఎస్ఆర్ విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పంచాయతీ ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

తిరుపతిరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గణితంపై భయం తొలగాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

గణితంపై భయాన్ని తొలగించి, ఆసక్తి కల్గించడానికి గణిత దశావధానం ఎంతో దోహదపడుతుందని కంచిలి మండలం బూరగాంకు చెందిన గణిత అవధాని మడ్డు తిరుపతిరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.గోవిందరావు ఆధ్వర్యాన గణిత దశావధానం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాలపై అడిగిన ప్రశ్నలకు క్షణాల్లో జవాబులు చెప్పి అందరిన్ని ఆశ్చర్య ర్చారు. గణితంలో ఘనమూలాలు, పంచమ మూలాలు, సమస్పాపేరణం, వారగణన, దత్తభస్వాంకం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంఇఒ ఎస్.అప్పలరాజు ఆధ్వర్యాన తిరుపతిరావుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.చలపతిరావు, సామ సంజీవరావు, మెట్ట వేణు, శేషాచలం, కెఆర్‌కె రెడ్డి, నీలం, సోమశేఖరరావు, నిర్మల, ఉషారాణి, విజయలక్ష్మి, రమణమూర్తి, నీరజ, సన్యాసమ్మ పాల్గొన్నారు.

గ్రంథాలయాల సందర్శన



శ్రీకాకుళం : పుస్తకాలను పరిశీలిస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఎపి గ్రంథాలయ పరిషత్ సభ్యులు జేను మహేష్‌బాబు, పౌర గ్రంథాలయ శాఖ సహాయ సంచాలకులు వి.రవికుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటల్ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దేందుకు ఎపి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గ్రంథాలయములో ఏయే కార్యక్రమాలు చేస్తున్నారు, ఏయే పుస్తకాలు చదువుతున్నారు, గ్రంథాలయం ఎలా ఉపయోగపడుతుందని విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. పుస్తకాలు కంప్యూటర్‌లో పొందుపరిచిన విషయం, గ్రంథాలయ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకర్‌రావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, జూనియర్ అసిస్టెంట్ చిరంజీవి పాల్గొన్నారు.

లావేరు: విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు అన్నారు. శనివారం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా లావేరు గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పుస్తక ప్రదర్శను పరిశీలించారు. డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలో పూల మొక్కలు నాటారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు జి.గడ్డియ్య, ఉపాధ్యాయులు భగవాన్, లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండలం ధర్మవరం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో శనివారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం హరికృష్ణ, పిడి శ్రీనివాసరావు, తెలుగు ఉపాధ్యాయులు పి.రామ్మోహనరావు, గ్రంథాలయాధికారి మలిపెద్ది చంద్రశేఖర్, సహాయకులు సూర్యనారాయణ, పాఠకులు ప్రకాష్, మహేష్, జగదీష్, సూరిబాబు, సురేష్, శంకర్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా శనివారం వ్యాసరచన పోటీలు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పద్మనాభం, గ్రంథాలయాధికారి అనురాధ, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణపతిరావు, ధర్మారావు, నీలిమ, రాణి, శంకర్, ధనుంజయ, భారతి పాల్గొన్నారు.

జి. సిగడాం: స్థానిక శాఖ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయాధికారి సిహెచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 9, 10 తరగతులకు దేశంలో రైతు, సైనికుల ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యారేగం, సత్యవతి, మోడల్ స్కూల్ లైబ్రేరియన్ లక్ష్మణ్, గ్రంథాలయ సిబ్బంది ఎస్.దుర్గారావు, పాఠకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కవితా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పులఖండం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎపిజివిబి మెంబర్ జి.రాజేష్, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో కవులు గ్రంథాలయ విశిష్టతపై కవితలను ఆలపించారు. కార్యక్రమంలో గుడిమెట్ల గోపాలకృష్ణ, చాడ శ్రీనివాస్, ప్రసాద్, ఉమాదేవి, సంతోష్, మోహన్ గాంధీ, శ్రావణ్, వాలిపల్లి రాజారావు, రంగనాయకులు, దుర్గాప్రసాద్, శరత్‌బాబు, శంకరరావు, రమణమూర్తి, గణేష్ పాల్గొన్నారు.

కొత్తూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విజ్ఞాన భారతి ప్రవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి టి.ఇందిర, ఉపాధ్యాయులు, సిబ్బంది లక్ష్మి పాల్గొన్నారు.

లావేరు : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కుమార్‌రాజు

మెళియాపుట్టి : ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇచ్ఛాపురం: స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆధునిక కాలంలో గ్రంథాలయాల ప్రాముఖ్యత అంశంపై పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రవిశంకర్ మహాపాత్రో, గ్రంథాలయాధికారి పూర్ణచంద్ర బెహరా, ప్రిన్సిపాల్ గోరికంటిరెడ్డి పాల్గొన్నారు.

టెక్కలి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు తెలుగుభాషా ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.పోలయ్య, ఉపాధ్యాయులు భాస్కరరెడ్డి, ఎన్.ప్రభావతి, వి.రాధిక, సహాయకురాలు అమ్మనమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్లు... గుంతల వలయాలు

కవిటి : నిరసన తెలుపుతున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డులో ప్రయాణికులు రోజూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు గారు ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి ఆదేశాల మేరకు గుంతల ఎపి భాగంగా శ్రీకాకుళం రూరల్ పరిధి రాగోలు రోడ్డుపై శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లో రోడ్ల దుస్థితి ఇలా ఉండటం దారుణమని విమర్శించారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లు దాటినా ప్రభుత్వం కనీసం కొత్త రోడ్డు నిర్మించలేదని విమర్శించారు. ప్రధానమైన జెమ్స్, రిమ్స్, కిమ్స్, ఇతర ఆస్పత్రులకు తిరుగుతున్న రోగులు సైతం గుంతల రోడ్డుతో అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రయాణాలు చేస్తూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వైసిపి నాయకుల మాటలకు, చేతులకు పొంతన లేదని విమర్శించారు. ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలపై కాకుండా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని హితవు పలికారు. దిగజారుడు వ్యాఖ్యల నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నిరసనలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు ఆర్అండ్‌బి రహదారిని నిర్మించుకోలేని దద్దమ్మ ప్రభుత్వం రాష్ట్రంలో పరిపాలన కొనసాగిస్తుందనిటిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. ముందుగా చింతాడ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి శనివారం పూలమాలవేసి నివాళ్లర్పించారు. శ్రీకాకుళం రోడ్డు చింతాడ వద్ద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, శివ్వాల సూర్యం, చిగురుపల్లి రామ్మోహన రావు, నూక రాజు, బోర గోవిందరావు, అన్నెపు భాస్కరరావు, జనసేన నాయకులు పాత్రుని పాపారావు, పైడి మురళీ మోహన్, కొత్తకోట నాగేంద్ర, ఎలకల రమణ పాల్గొన్నారు.

కవిటి : గతుకుల రోడ్లు..గుంతల వలయాలతో ప్రజలు ప్రయాణం చేయాలంటేనే హడలిపోతున్నారని ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన నాయకుడు దాసరి రాజు అన్నారు. మండలం రాజపురం నుంచి కమలాయిపుట్టుగ గ్రామానికి వెళ్లే రహదారిపై టిడిపి, జనసేన శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ తమ హయాంలో కోటి 20 లక్షలు ఈ రహదారికి మంజూరు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బెందాళం రమేష్, సీపాన వెంకటరమణ, కొర్రాయి వాసు, పుల్లట సంతోష్, సంతోష్‌పట్నాయక్, బాసుదేవ్ రౌలో, జనసేన నాయకులు దుర్యోధన రెడ్డి, నాగుల హరి బెహరా, డి.నీలవేణి, ఆర్.భాస్కరరావు పాల్గొన్నారు.

పలాస: పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు గోతులు పడ్డ రహదారులు కనిపించడం లేదా అని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్, జనసేన పలాస నియోజకవర్గం నాయకులు డాక్టర్ దుర్గారావు అన్నారు. మండలం మొదుగులపుట్టి వద్ద గోతులు ఏర్పడిన రహదారిపై శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో కాలంగా గోతులుగా మారిన రహదారి గోతులను పూడ్చలేని ప్రభుత్వం రాష్ట్రంలో ఉందన్నారు. మంచినీళ్లపేట నుంచి టెక్కలిపట్నం ఆంధ్రారోడ్డుపై ఏర్పడిన గోతులు, చెరువును తలపించేలా ఉన్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. టిడిపి పాలనలో ప్రతి మారుమూల గ్రామానికి రోడ్లు వేసిన ఘనత మాజీ సిఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందని, వైసిపి పాలనలో ఆరాచకాలు పెరిగిపోయాయని, ఆ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్, తలగాన నరసింహమూర్తి, విష్ణు చౌదరి, అవుగాన దశరథ, షన్ముఖరావు, వంకల కూర్మారావు, కుమారాజు, విష్ణుచౌదరి, మాధవయ్య, జానికిరావు, గోపాల్, దిలీప్ కుమార్, సందీప్, ధర్మారావు, కిరణ్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

కొత్తూరు : టిడిపి, జనసేన నివగాం వద్ద అంధ్వానంగా రోడ్డుపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గేదెల చైతన్య, టిడిపి మండల ప్రధాన కార్యదర్శిపి.మోహనరావు, గెడ్డవలస కమలాకర్, అగతముడి అరుణకుమార్, అచ్యుతరావు, కోటి, జయరాజ్, వీరభద్రస్వామి పాల్గొన్నారు.

ఆర్‌పిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 7వ వార్డు చినబాడాంకి చెందిన అష్టలక్ష్మీ మహిళా సంఘానికి సంబంధించి రూ.4 లక్షలు స్వాహ జరిగినట్లు సభ్యులు కలేపల్లి రాణి, పర్రి రమణమ్మలు ఆరోపించారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రూప్‌లో 15 మంది సభ్యులు ఉన్నారని, అందరూ కలసి 2021 జనవరి 11న రూ.పది లక్షలు డ్వాక్రా గ్రూప్ రుణాన్ని ఇండియన్ బ్యాంకులో తీసుకున్నామని అన్నారు. ప్రతినెలా రుణం చెల్లించడంతోపాటు కొంత నగదును పొదుపులో జమ చేస్తూ వచ్చామని చెప్పారు. తమ పొదుపు ఖాతాలో రూ.4 లక్షలు జమ అయిందని తెలిపారు. అయితే గ్రూప్ సభ్యులకు తెలియకుండా సంఘంలోని కొంతమంది సభ్యులు ఆర్‌పి గార పద్మావతితో కలిసి పొదుపు ఖాతాలో ఉన్న సొమ్మును సభ్యులకు తెలియకుండా విత్‌డ్రా చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ నగదును వారి సొంత ఖర్చులకు ఉపయోగించుకున్నారని, ఈ విషయం తెలిసిన గ్రూప్ సభ్యులు వారిని నిలదీశామన్నారు. సభ్యుల్లో ఒకరైన మామిడి అరుణకు సంబంధించి ఆధార్ నంబరు బ్యాంకు ఖాతాకు లింక్ అవ్వడంతో పొదుపు సొమ్మును ఆమె ఖాతా జమ అయ్యిందన్నారు. దానిని ఆర్‌పి, కొంతమంది సభ్యులు తీసుకొని సొంత ఖర్చులకు వినియోగించుకున్నారని తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులు స్పందించి విచారించి గ్రూప్ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. ఇలాంటి సంఘటనలు మరో గ్రూపునకు జరగకుండా ఆర్‌పి పద్మావతిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

రైతు సంక్షేమమే ధ్యేయం

మాట్లాడుతున్న నరేంద్ర యాదవ్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

దేశంలో సహకార ఉద్యమాన్ని ప్రోత్సహించి సహకార రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొని వచ్చి, భారతదేశంలో సహకారోద్యమం బలోపేతానికి కృషి చేసిన మొట్టమొదటి భారత ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని పిఎసిఎస్ అధ్యక్షులు నరేంద్ర యాదవ్ అన్నారు. శనివారం స్థానిక సహకార సంఘ కార్యలయం వద్ద జాతీయ సహకార వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా పిఎసిఎస్‌లో పబ్లిక్, ప్రైవేట్ సహకార భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం' అనే అంశంపై ఒక్కరోజు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సహకార చట్టం ముసుగులో అనేకమంది వ్యాపారులు అక్రమంగా ప్రవేశించి సహకార స్ఫూర్తికి విఘాతం కల్పిస్తూ గ్రామీణ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న వైనాన్ని నరేంద్ర వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వైస్ చైర్మన్ భారతీ దివ్య, ప్రకాశరావు పట్నాయక్, సుగుణ, డిసిసిబి మేనేజర్ తులసీబాయి పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పిఎసిఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్ అన్నారు. సరుబుజ్జిలిలో కొత్తకోట సహకార సంఘం ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కార్యాలయం వద్ద పతాకాన్ని ఆవిష్కరించారు. జగన్నాథరావు, సింహాచలం పాల్గొన్నారు.

జగన్ ఎందుకు కావాలంటే...

ప్రజాశక్తి- సోంపేట

మండలంలో కొర్లాం గ్రామ పంచాయతీలో శనివారం ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. బాబు ఆపు నీ నాటకం, మా నమ్మకం జగనే అనే నినాదంతో కార్యక్రమాన్ని చేపట్టారు. నాలుగున్నర ఏళ్ల కాలంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఒకేఒక్క ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సైతం చేసిన ముఖ్యమంత్రి మళ్లీ కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శిలగాన భాస్కరరావు, తామాడ గణపతి, తామాడ పద్మావతి, మోహనరావు, దుంపల మోహనరావు, బి.పాపారావు పాల్గొన్నారు.

కొర్లాంలో ప్రచారం చేస్తున్న ఎంపిపి దాసు

వేరుశనగ విత్తనాలు పంపిణీ

వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న తిలక్

నందిగాం: సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతు సంక్షేమానికే పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ తెలిపారు. శనివారం మండలం పెంటూరు గ్రామంలో సబ్సిడీపై రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో రైతు సంక్షేమానికి పెద్దఎత్తున నిధులు కేటాయించి అన్ని రకాల విత్తనాలతో పాటు యంత్ర పరికరాలు సబ్సిడీపై అందజేయడం జరుగుతుందన్నారు. రైతులకు పూర్తిస్థాయి సేవలు అందజేయాలనే లక్ష్యంతో ప్రతి సచివాలయంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పథకాలను అందజేయడం జరుగుతుందని, రైతులంతా సిఎం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి, సర్పంచ్ జడ్యాడ జయరాం, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు శ్యామ సుందరావు, ఎంపిటిసి అంబోడి విష్ణు, వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్ వర్మ, వైసిపి నాయకులు ప్రధాన రాజేంద్ర, చిన్ని జోగారావు యాదవ్, అట్టాడ సీతారాం పాల్గొన్నారు.

సందడిగా ముగిసిన జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్

టెక్కలి: ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆప్‌కాస్ట్) పర్యవేక్షణలో స్థానిక ఆర్‌సిఎం పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రదర్శనలో 160 పాఠశాలల నుంచి 180 ప్రాజెక్టులు ప్రదర్శనలో నిలవగా వీటిలో 7 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కి ఎంపికయ్యాయి. ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టుల ప్రదర్శన, పనిచేసే విధానాన్ని సంబంధిత విద్యార్థుల వివరణ పలువురుని ఆకట్టుకున్నాయి. ముగింపు సమావేశానికి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పదం అలవడాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులకు బహుమతులతో పాటు ధృవపత్రాలు అందజేసారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ కొత్తకోట అప్పారావు, అధ్యాపకులు డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కె.తిరుమలరావు, రవి, వాసుబాబు, శ్రీకాకుళం, టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారులు తిరుమల చైతన్య, గార పగడాలమ్మ, సైన్స్ ఎగ్జిబిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ కుమారస్వామి, ఎంఇఒలు తులసిరావు రెడ్డి, దాసుపురం చిన్నారావు పాల్గొన్నారు.

ఎంపికైన ప్రాజెక్టులు

జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టుల్లో ఎకోఫ్రెండ్లీ ఇన్‌సెన్స్‌స్టిక్స్ (సింగుపురం) న్యూట్రెంట్స్ అండ్ బెనిఫిట్స్ ఆఫ్ బనానా స్టేమ్ (కోష్ట) హెల్దీ అండ్ న్యూట్రీషీ వెల్ (కోటబోమ్మాళి ఎంజెపి స్కూల్) ఆర్గానిక్స్ పార్మింగ్ హోలిస్టిక్ అప్రోచ్ (పాతపట్నం ఎపిఎంఎస్ స్కూల్) బయో రెమిడేషన్‌ఆఫ్ హెవీ మెటల్స్ యూజింగ్ సెవ్ ఎకో సిస్టమ్ (పలాస) టాప్ సాయిల్ డిగ్రేడేషన్ డ్యూ టు బ్రిక్ ఇండస్ట్రీ రెమిడిస్ (పాతపట్నం)బయో డిగ్రేడిబుల్ సానిటరీ నాపికిన్స్ ఫ్రమ్ కార్న్ హస్క్ (మురపాక) పాఠశాలలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఎంపిక కాబడ్డాయి.

శ్రీకాకుళం : గ్లోబల్ స్కూల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు

శ్రీకాకుళం: స్థానిక గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. సైన్స్, దాని ఆవశ్యకతతో పాటు పాఠశాల బాలబాలికలు అత్యున్నతమైన సైన్స్ ప్రదర్శనను ప్రదర్శించారు. 150 మంది విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు చేసి వచ్చిన వారికి కనువిందును కల్పించారు. ఈ ప్రాజెక్టులను గ్లోబల్ గ్రూప్ ఆఫ్ స్కూల్ ఫౌండర్ ఎం.ప్రసాదరావు, ప్రిన్సిపాల్ వై.సారికారెడ్డి విద్యార్థులను అభినందించారు.

వెలుగులో 'చీకటి లెక్కలు' తేలుస్తారా?

ప్రజాశక్తి- నౌపడ

మండలంలో నౌపడ పంచాయితీ పాలనాయుడుపేట గ్రామ సమైక్య సంఘ సిఎఫ్ పరపటి సుమలత గ్రామసమైక్య సంఘంలోని గ్రూపుల్లో నుంచి ఎన్ని లక్షలు అవినీతికి పాల్పడిందోనన్న నిగ్గు తేల్చాల్సిన అధికారులు మౌనం వహించడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామైక్య సంఘంలో 46 మహిళా సంఘాలుండగా వాటిలో కొన్ని గ్రూపుల్లో నుండి రూ.2.40 లక్షలు సొంతానికి వాడుకున్నట్లు ప్రాథమికంగా అంచనాకి వచ్చారు. మిగతా గ్రూపుల్లో ఎంతమేర నిధులు దుర్వినియోగానికి పాల్పడిందో అన్న విషయం తేల్చాల్సిన వెలుగు అధికారులు మొద్దు నిద్ర వహించడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అవినీతి గత మూడేళ్లుగా సిఎఫ్ సుమలత చేస్తున్నా ఇంతవరకు వెలుగు అధికారులు ఎందుకు గుర్తించలేదని మహిళా సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు. గ్రామైక్య సంఘాల నిర్వహణపై పర్యవేక్షించాల్సిన సంబంధిత కస్టర్ సిసి, మండల వెలుగు ఎపిఎంలు స్పందనలో ఫిర్యాదు చేసేంత వరకు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతినెలా మండల స్థాయిలో జరిగే సమావేశాలకు సిఎఫ్ సుమలత డుమ్మా కొడుతున్నా ఆమెపై ఇంతవరకు ఎటువంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంలో వెలుగు అధికారులు ఎందుకు వెనుకడుగు వేశారో తెల్చాల్సి ఉంది. సిఎఫ్ సుమలత చేసిన అవినీతి ప్రాథమికంగా రూ.2.40 లక్షలు అని చెబుతున్నా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే రూ.10 లక్షల వరకు ఉంటుందని మహిళా సంఘ సభ్యులు చెబుతున్నారు. ఇంత అవినీతి జరిగినా ఇప్పటికీ సిఎఫ్ సుమలత లోన్ లర్జర్, క్యాష్ రశీదు పుస్తకాలు మండల వెలుగు కార్యాలయానికి ఇవ్వకపోయినా ఇంతవరకు ఆమెపై వెలుగు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మహిళ సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి సిఎఫ్ సుమలత ఎన్ని లక్షల అవినీతికి పాల్పడిందో నిగ్గు తెల్చాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి- కవిటి

మండలం బొరివంక పిహెచ్‌సిలో వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ హరితను తోటి వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది శనివారం ఆత్మీయ సత్కారం చేశారు. డాక్టర్ హరిత విజయవాడలో డెర్మటాలజి(ఎండి)లో పిజి చేసేందుకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ సత్కారం చేసినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ తేజ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బందితో డాక్టర్ హరిత

నందివాడలో పూరిల్లు దగ్ధం

పొందూరు: మండలం నందివాడ గ్రామంలో శనివారం సంభవించిన అగ్నిప్రమాదంలో ఎచ్చెర్ల ఆదిలక్ష్మికి చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు ఆదిలక్ష్మి ఇంట్లో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ దగ్గరలో ఉన్న కిరాణా దుకాణానికి సామాగ్రి కొనేందుకు వెళ్లింది. ఇంతలో పొయ్యినుండి మంటలు ఎగిసిపడి పూరిల్లుకు అంటుకోవడంతో క్షణాలో బూడిదైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేసరికి పూర్తిగా కాలిపోవడంతో మంటలు వ్యాపించకుండా పూర్తిగా ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న రూ.20వేలు నగదు, విద్యుత్తు ఉపకరణాలు, నిత్యవసర సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంతో సుమారు రూ.50వేలు వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ఈ ప్రమాదంతో తీవ్రంగా నష్టపోయానని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని ఆమె కోరారు.

మంటలను అదుపు చేస్తున్న గ్రామస్తులు

తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న రైతులు

రైతులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పూర్వికుల నుంచి వ్యవసాయంపైనే ఆధారపడి భూములు సాగుచేస్తున్న నిరుపేద కుటుంబాలకు చెందిన మురికింటిభద్ర గ్రామ రైతులకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు నేతృత్వంలో తహశీల్దార్ సరోజినికి విన్నవించారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో 2012లో ఫీల్డ్ టు ఫీల్డ్ సర్వే జరిగిందని, ఆ సర్వేలో అప్పటికి వారు సాగు చేస్తున్న ప్రాప్తికి ఆయా రైతు పేర్లు నమోదు చేయబడ్డాయని, ఇప్పటికీ చాలా మందికి 1బి, అడంగల్ రావడం లేదని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా జగనన్న భూ హక్కు - భూరక్ష సర్వే ప్రక్రియకు సంబంధించి రైతుల పేర్లు రికార్డులలో నమోదు చేయించి ఫీల్డ్ సర్వే చేయించి 1బి, అడంగల్ కాపీలు వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో లొడగల శ్రీనివాసరావు, గనియ తిరుపతిరావు, బి.శ్రీరాములు, బి.శ్రీనివాసరావు, బి.బైరాగి, ప్రసాదరావు, సిహెచ్ శేఖర్, రైతులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామీణ ప్రాంతంలో మహిళా రైతులతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లోని సభ్యులంతా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని వైఎస్ఆర్ క్రాంతిపథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. శనివారం పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య సభ్యుల సమావేశంలో పాల్గొని అవగాహన కల్పించారు. గ్రామాల్లో రైతులందరికీ అవగాహన కల్పిస్తూ, పశువుల ఎరువును వినియోగించి భూసారాన్ని పెంచాలని తెలిపారు. అధిక మోతాదులో ఎరువులు, క్రిమిసంహారక మందులు ఉపయోగించడం వల్ల నేల పాడై, భూమి నిస్సారమవుతుందన్నారు. మహిళా రైతులంతా తమ గ్రామాల్లో వర్మి కంపోస్టు యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని, బ్యాంకుల ద్వారా అవసరమైన రుణాలను పొంది పెరటి తోటల పెంపకానికి ఆసక్తి పెంచేటట్లు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా మునగ, జామి, బొప్పాయి, కొత్తిమీర, కరివేపాకు తదితర మొక్కలను విరివిగా పెంచుతూ వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అకౌంటెంట్ కళ్యాణి, ఉపాధ్యక్షురాలు ఉషారాణి, కోశాధికారి రేణుక, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు సుభద్ర, రమణ, రామప్పడు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట రోటరీ క్లబ్ రోజూ ఏదో ఒక సేవా కార్యక్రమం చేస్తూ...ఉద్దానం ప్రజల మన్ననలు పొందుతుందని క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో రోటరీ క్లబ్ ప్రాంగణంలో గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ కేర్ సోంపేట డాక్టర్ వి.విజయ్ కుమార్ సహకారంతో శనివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉద్దానం ప్రాంతం నుంచి 200 మంది రోగులు పాల్గొన్నారు. వంద మందికి పైగా దంతాలు తీయించుకొని ఫిల్లింగ్ చేయించుకున్నారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ, సెక్రటరీ పి.వి.కృష్ణారావు, ట్రెజరర్ కె.రవికుమార్ పాల్గొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గిరిజ

నేత్రాలపై శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని గరుడభద్ర సర్పంచ్ గూడ గిరిజా ఈశ్వరరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 38 మందికి శనివారం కళ్లద్దాలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను తీసుకొచ్చిన ఘనత సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలకు కార్పోరేట్ స్థాయి వైద్యం అందించాలనే సంకల్పంతో ముందుకు అడుగులు వేస్తున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వై.ఆనందరావు, జి. ధనరాజ్, జి.జానకిరావు, టి.కృష్ణమూర్తి, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి వై. మహిజ, కార్యదర్శి బి. మోహనరావు, ఎఎన్ఎం ఎస్.భారతి, ఆశ కార్యకర్త చామంతి పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలో ప్రతిభ

టెక్కలి: మండలంలో పెద్దసాన ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండ్ పోటీల్లో పాల్గొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను శనివారం అభినందించారు. గరికపాటి దనుష్ బంగారు పతకాన్ని సాధించగా, దుబ్బక హరికృష్ణ కాంస్య పతకాన్ని సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోడ్డేపల్లి నేతాజీ తెలిపారు. ఎంపికకు కృషిచేసిన వ్యాయామ ఉపాధ్యాయులు పాండవుల జగదీష్, విద్యార్థులను అభినందించారు.

అనాథులకు వితరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ ఒకటో వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్ మనవడు సుగ్గు మోక్షిత్ చంద్ర పుట్టిన రోజు సందర్భంగా సీతయ్య ఫౌండేషన్‌లో రేషన్ సరుకులు వితరణగా అందించారు.. అనాథులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ పిలకా రాజ్య లక్ష్మి, పట్టణ వైసిపి అధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్, యువసూర్య ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాంబాబు. సుగ్గు హరీష్. త్రినాథ్ పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

పొందూరు : మేనిఫెస్టో పత్రాలను అందజేస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్ర అభివద్ధి టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలం కనిమెట్ట గ్రామంలో శనివారం మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే పలు గ్యారెంటీ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి సీపాన శ్రీరంగనాయకులు, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర్ భాస్కరరావు, మాజీ సర్పంచ్ అన్నెపు శ్రీనివాసరావు, ఎంపిటిసి ప్రతినిధి కూన కృష్ణమూర్తి, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి పాల్గొన్నారు.

లావేరు: రాష్ట్రం మరలా సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే మరలా మాజీ సిఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ప్రజలంతా విశ్వసిస్తున్నారని టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి మజ్జి రామ్మూర్తి అన్నారు. మండలంలో గుమ్మడాం పంచాయతీ వాళ్లపేటలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోసకారి వైసిపి ప్రభుత్వాన్ని ఓటుతో భూస్థాపితం చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దుర్గశి కోటీశ్వరరావు, బంగరునాయుడు, వినోద్‌కుమార్, పోలినాయుడు, నూకరాజు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రాష్ట్రానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఏమి మేలు చేశారో వైసిపి నాయకులు చెప్పాలని జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్‌లు అన్నారు. కోటబొమ్మాళి మేజరు పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫోస్టోను

లావేరు : ఇంటింటా ప్రచారం చేస్తున్న రామ్మూర్తి

వివరించారు. అంతకుముందు కోటబొమ్మాళి-సంతబొమ్మాళి, కోటబొమ్మాళి- లఖందిడ్డి గ్రామాల రహదారిలో మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కార్యక్రమంలో పూజారి శైలజ, గొండు లక్ష్మణరావు, కర్రి అప్పారావు, హనుమంతు అప్పలరాజు, సానుమంతు ఆనంద్ పాల్గొన్నారు.

అలాగే చీపురుపల్లి పంచాయతీ ఉడికపాడులో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొండు లక్ష్మణరావు, పొన్నాన అప్పన్న, నేతింటి జగన్నాథరావు పాల్గొన్నారు. హరిరిశ్చంద్రపురంలలో నిర్వహించిన కార్యక్రమంలో హనుమంతు అప్పలరాజు, తర్ర రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు పాల్గొన్నారు.

కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా కాశీనగర్ పట్టణంలో శనివారం పంట నష్టపరిహారం కోరుతూ బిజెపి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభ నిర్వహించారు. ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు మాట్లాడుతూ కాశీనగర్ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇల్లు పంపిణీ సక్రమంగా జరగాలని వారు కోరారు. బిజెడి ప్రభుత్వ అవినీతిని వారు ఎండగట్టారు. కార్యక్రమంలో చిత్తిరికి సింహాద్రి, రొక్కం నారాయణరావు, ఉమా గంతాయత్, వాడాని చలపతి పాల్గొన్నారు.

ఆటల పోటీలు

ప్రజాశక్తి- బూర్జ

జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఈనెల 21న బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బాల బాలికలకు మండలస్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు ఎస్.శ్యాంసుందరరావు, ధనుంజయరావులు తెలిపారు. శనివారం స్థానిక ఎంఆర్‌సిలో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్క వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనేలా తీర్చిదిద్దాలన్నారు. 20వ తేదీ నాటికి పాఠశాలకు చేరుకోవాలన్నారు. 21 నుంచి విధిగా ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ ఆర్గనైజర్ నెల్లి వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్వహణలో లోపం రాకూడదు

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించే క్రమంలో నిర్వహణలో ఎటువంటి లోపం రాకూడదని ఎంఇఒ దాసుపురం చిన్నారావు అన్నారు. మండలంలో నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని శనివారం పర్యవేక్షించారు. వంట కార్మికులు తయారు చేసిన ఆహార పదార్థాలను రుచి చూసి మెనూలో ఎటువంటి మార్పులు చేయరాదన్నారు. అనంతరం నాడునేడు పథకంలో భాగంగా నిర్మాణం జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు బడగల ప్రమీల, ఇసంపల్లి చిన్నవాడు, పాలవలస ధర్మారావు, రోణంకి విజయ్‌కుమార్, ఎస్.శ్రీనివాసరావు, యరపత్ని వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపర్చాలి

ప్రజాశక్తి- నందిగాం

గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలను చైతన్య పర్చాలని ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి కోరారు. ఎంపిడిఒ కార్యాలయంలో బాల్య వివాహాల నియంత్రణపై ఐసిడిఎస్ అధికారుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల అమ్మాయిలు అనారోగ్యాలకు గురి కావడం, మానసిక ఇబ్బందులకు గురికావడం, తక్కువ వయసులో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలపై మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివప్రసాద్, తహశీల్దార్ వై.పద్మావతి, ఎంఇఒ నరసింహులు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కౌన్సిలర్ డి.సీతారాం, చైల్డ్‌లైన్ సభ్యులు మల్లేశ్వరరావు, శివాజీ, సునీత, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు కె.జలజాక్షి, వై.శారద, మహిళా పోలీసులు, విఆర్‌ఒలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

రైతుల వద్దకే వెళ్లి ధాన్యం కొనాలి

వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి- పలాస

ప్రతి ధాన్యపు గింజ రైతుల వద్దకే వెళ్లి ప్రభుత్వం కొనుగోలు చేయాలని జనసేన పార్టీ నాయకులు హరీష్‌కుమార్, శ్రీకాంత్, కొన కృష్ణారావులు కోరారు. ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది పంటలు బాగా పండినా ప్రభుత్వం రైతు వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేయడంతో విఫలమైందన్నారు. ఈ ఏడాది వర్షాలు లేక నీరు అందక అధిక పంట నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పెట్టుబడులు పెట్టిన రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పలాస నియోజకవర్గంలోని మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. నీటి సదుపాయం ఉన్న ప్రాంతంలో కాస్త పండిన పంటలను రైతులు భరోసా కేంద్రాలకు వెళ్లి ధాన్యం అమ్మేందుకు రైతులు మరింత భారం పడుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గిరిబాబు, కిరణ్ పాల్గొన్నారు.

బాబూరావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి- పలాస

సమాజంలో పురుషులకు ప్రత్యేకస్థానం ఉందని, కుటుంబ పెద్దగా తన విధి నిర్వహణలో సక్రమంగా నిర్వహించినప్పుడే ఆ కుటుంబం అభివృద్ధిలో ఉంటుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మదర్‌థెరిస్సా పాఠశాల చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. పాఠశాలలో శనివారం పురుషుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులు తమ విధి నిర్వహణను సక్రమంగా నిర్వహించడమే కాకుండా భార్యలను, మహిళలకు గౌరవించాలన్నారు. అనంతరం వజ్జ బాబూరావుతో పాటు పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల

బాబూరావుకు సన్మానం చేస్తున్న పాఠశాల యాజమాన్యం

కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని, వజ్జ అవినాష్, ఇన్‌ఛార్జి ఆర్.ప్రసాదరావు, ఉపాధ్యాయులు జోగారావు, కూర్మారావు, చిరంజీవి, లక్ష్మణరావు, ఉపాధ్యాయులు శశిరేఖ, బేబీ, కల్పన, స్రవంతి, యశోద పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

లోక్ అదాలత్‌పై సూచనలు చేస్తున్న జస్టిస్ బి.జ్యోత్స్న

ప్రజాశక్తి- పొందూరు

డిసెంబర్ 9న జరగనున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జస్టిస్ బి.జ్యోత్స్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సివిల్‌కోర్టులో శనివారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇరువర్గాలతో మాట్లాడి కేసుల రాజీ వలన కలిగే ప్రయోజనాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, పొందూరు, జి.సిగడాం మండలాల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పోలాకి

నరసన్నపేట సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎఇ కోటీశ్వరరావు తెలిపారు. శనివారం నరసన్నపేటలో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నరసన్నపేట, సత్యవరం, బొరిగివలస, తామరాపల్లి, గొట్టిపల్లి, జమ్ము కరగాం, కంబకాయి, దూకలపాడు, చల్లబంద, చీడివలస, జడూరు, పిరువాడ, వై బి వలస, ఈదులవలస జంక్షన్ తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

ఆమదాలవలస :ఈ నెల 20న సోమవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తార్ బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేట రోడ్డు వెడల్పు చేస్తున్న కారణంగా విద్యుత్ స్తంభాలు, తీగలు మార్చుట దృష్ట్యా చెట్లు కొమ్మలు తొలగించడానికి సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. బొడ్డేపల్లిపేట సబ్‌స్టేషన్ పరిధిలో రూరల్ పరిధిలో అక్కులపేట, మండాది, ఈసర్లపేట, గాజులకొల్లివలస, జొన్నవలస, రామ చంద్రాపురం, పొన్నాంపేట, మునగవలస, అలాగే మున్సిపాలిటీ పరిధిలోని బొడ్డేపల్లిపేట, వెంకయ్యపేట, లక్ష్మడుపేట, తిమ్మాపురం, జగ్గు శాస్త్రుల పేట, పార్వతీశంపేట, మునగవలస స్టోన్‌క్రషర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. ఈ అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

జగన్ పాలనలో ఉపాధికి ఎసరు

ఆమదాలవలస: సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని రంగాలకు చెందిన కార్మికులు ఉపాధికి దూరమై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర టిఎన్‌టియుసి అధ్యక్షులు రఘురాం రాజు అన్నారు. శనివారం జిల్లా టిఎన్‌టియుసి అధ్యక్షులు గాడు నారాయణరావు ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలను తెలుసుకునే క్రమంలో భాగంగా పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా రఘురాం రాజు మాట్లాడుతూ వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో ప్రభుత్వంపై పోరాటం చేయడానికి శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో పర్యటించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర టిఎన్‌టియుసి అధ్యక్షులు లెనిన్, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల బేస్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో పెద్దపాడు అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇంటర్ ఫస్ట్ ఎంపిసి ఎస్.ప్రవళిక, పదో తరగతి చదువుతున్న సిహెచ్.అనురాధ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మూడో స్థానం కైవసం చేసుకున్నారు. ఈ నెల 15 నుంచి 16 వరకు గుంటూరు జిల్లా నిడదవోలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ వీరికి ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ బి.మాధవీలత, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.పుష్పవేణి, పిఇటి జయశ్రీ, వార్డెన్ హఫీజ్ బేగం అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- కవిటి

మండలం బోరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బల్ల సందీప్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ తెలిపారు. ఇటీవల అరకులో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సందీప్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు సందీప్‌కు అభినందనలు తెలియజేశారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సర్పంచ్ వడ్డీ సరిత అన్నారు. ఎంపిటిసి భాగ్యలక్ష్మితో కలిసి సిసి రోడ్డు, డ్రెయినేజీ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. గడపగడపకు మంజూరైన నిధుల నుంచి రూ.2.50 లక్షలతో డ్రెయినేజీ పనులు చేపడుతున్నామని తెలిపారు. స్థానిక మంత్రి అప్పలరాజు సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు వడ్డీ కరుణాకర్, దిల్లేశ్వరరావు, మత్స్యకార అధ్యక్షులు పాపారావు, సీనియర్ నాయకులు వడ్డీ కామరాజు, పార్టీ అధ్యక్షులు రామచంద్ర, పోలయ్య, దేవమ్మ పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వే వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో రైల్వే అధికారులు కాలిబాటను నిలిపివేశారు. ఈ విషయంపై మంత్రి సీదిరి అప్పలరాజు రైల్వే అధికారులతో చర్చించి మరలా శిథిలావస్థలో ఉన్న వంతెనను తొలగించారు. అదే స్థానంలో నూతన వంతెన ఏర్పాటుకు కృషి చేశారు. దీంతో నర్సిపురం గ్రామస్తులు శనివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. మండలంలోని బెజ్జిపుట్టుగలో శనివారం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా అవనీతి రహితంగా సంక్షేమ పథకాల అమలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, దానికి ఆర్థిక సాయం, మహిళలకు ప్రత్యేక గుర్తింపు ప్రస్తుత ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాలు వివరించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్, ఎఎంసి వైస్ చైర్మన్ నీలయ్య, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, నాయకులు జల్లు యుగంధర్, ఎస్.పి.ప్రవీణ్, ఎర్ర రవి, బి.మురళి పాల్గొన్నారు

రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రాయవలస శ్రీ ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయానికి ఎదురుగా అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి రూ.50వేలు సంతబొమ్మాళి మండల జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి శనివారం అందజేశారు. శ్లాబ్ నిర్మాణానికి టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకారాన్ని అందించాలని కోరారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- బూర్జ

పాలకొండలో త్వరలో నిర్వహించనున్న పెట్రోల్ బంకులో ఉద్యోగాలకు గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి ప్రకటనలో తెలిపారు. గౌరవ వేతనంపై పనిచేయడానికి సూపర్‌వైజర్ ఒక పోస్టుకు ఏదైనా డిగ్రీ పాసై ఉండాలన్నారు. పంప్‌బాయ్ 7 పోస్టులకు ఇంటర్మీడియట్ అర్హత ఉండాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట, పాలకొండ, వీరఘట్టం, భామిని మండలాలు, శ్రీకాకుళం జిల్లాలో కొత్తూరు, హిరమండలం, పాతపట్నం, మందస, మెళియాపుట్టి, కంచిలి, సోంపేట, పలాస, టెక్కలి, నందిగాం, జలుమూరు, బూర్జ, లావేరు, సురుబుజ్జిలి, ఎల్‌ఎన్.పేట మండలాలకు చెందిన పరిసర గ్రామాల అభ్యర్థులు మాత్రమే దరఖాస్తులు ఈ నెల 27లోగా ఐటిడిఎలో పరిపాలనాధికారి కార్యాలయానికి అందజేయాలన్నారు.

విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- పలాస

టెక్కలి ఆర్‌సిఎం పాఠశాలలో శనివారం జిల్లాస్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (ఆఫ్ కాస్ట్) పోటీల్లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. పర్యవరణ వ్యవస్థ ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక విభాగంలో ప్రథమ స్థానం సాధించి ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు డి.యుగంధర్, డి.రాకేష్, సలహాదారుడు జె.షన్ముఖరావులను శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.దానరథి, పిడి తవిటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.